ప్రియాంక గాంధీని కలిసిన అజారుద్దీన్


ప్రియాంకగాంధీతో అజారుద్దీన్

బంజారాహిల్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్ ఎంపీ ప్రియాంక గాంధీని కలిశారు. శుక్రవారం ఢిల్లీలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుతెన్నులతో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని తెలిపారు.

'డబుల్' ఇళ్ల పేరిట మోసం

● పోలీసుల అదుపులో నిందితుడు

బోరబండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని నమ్మించి పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితుడిని బోరబండ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. బోరబండ బలహీనవర్గాల కాలనీ అంబేడ్కర్ నగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు రెండు పడక గదుల ఇల్లు ఇప్పిస్తానంటూ పలువురి వద్ద నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. అంతేగాకుండా ఇళ్లు మంజూరైనట్లు నకిలీ పత్రాలను వారికి అందజేశాడు. ఆ పత్రాలతో కమలానగర్, కొల్లూరు ప్రాంతాలకు వెళ్లిన వారికి తాము మోసపోయినట్లు తెలిసింది. దీంతో ముగ్గురు బాధితులు బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.3.5లక్షలు వసూలు చేశాడని, తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితుల సంఖ్య ఇంకా పెరగవచ్చునని బోరబండ ఇన్‌స్పెక్టర్ ఎం.సురేందర్‌గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ కాశయ్య ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.


ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్‌నగర్ నాలాను పరిశీలించి చెత్తను తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్


కృష్ణానగర్‌లో కూలిన అపార్ట్‌మెంట్ ప్రహరీ

వర్షానికి కూలిన ప్రహరీలు

వాహనాలు ధ్వంసం

బంజారాహిల్స్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి ప్రహరీలు కూలాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీకి ఆనుకొని ఉన్న హుడా ప్రహరీ గురువారం కురిసిన వర్షానికి నాని హకీంపేట బస్తీల వైపు కూలింది. శిథిలాలు పడడంతో రెండు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌ను వరద ముంచెత్తింది. ఎగువ నుంచి భారీ వరదనీరు రావడంతో కృష్ణానగర్ 'బీ' బ్లాక్‌లో ఉన్న భారతీనిలయం అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలింది. దీంతో వరద నీరు అపార్ట్‌మెంట్ పార్కింగ్ ప్రాంతంలోకి రావడంతో వాహనాలు మునిగిపోయాయి.


బంజారాహిల్స్‌లో కూలిన ప్రహరీ

గాయత్రి నగర్‌లో ఇళ్లలోకి వర్షం నీరు

● రాత్రంతా అవస్థలు పడ్డ బస్తీవాసులు

అమీర్‌పేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇక్కడి నాలాలోకి భారీగా వరద నీరు రావడంతో అవి ఉప్పొంగి ప్రధాన రోడ్లు, కాలనీలు, బస్తీలోకి నీరు చేరింది. దీంతో జనం ఆగమాగమయ్యారు. మైత్రివనం వెనక నాలా పొంగడంతో వర్షం నీరు గాయత్రి నగర్ గంగుబాయి బస్తీ, శ్రీనివాసనగర్ కాలనీలోని ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. దీంతో ఇక్కడి వారు రాత్రంతా నానా అవస్థలు పడ్డారు. ప్రధానంగా ఇళ్లలోని నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. గాయత్రి నగర్‌లో చేపట్టిన నాలా పనులు నత్తనడకన నడుస్తుండడంతో ముంపు పరిస్థితి ఏర్పడుతోంది. బుధ, గురువారాల్లో దంచి కొట్టిన వర్షంతో ఎర్రగడ్డ నుంచి లక్డీకాపూల్, సత్యం టాకీస్ నుంచి ఫతేనగర్ ఫ్లై ఓవర్, మైత్రివనం నుంచి సత్యం టాకీస్ వరకు గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ దుస్థితికి నాలాలు ఆక్రమణకు గురికావడమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి ఆక్రమణలను వెంటనే కూల్చివేసి వరద ముంపు నుంచి కాపాడాలని కోరుతున్నారు.


గాయత్రి నగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు


ఖైరతాబాద్ పోస్టాఫీస్‌లో సర్వర్ డౌన్ అంటూ అంటించిన పోస్టర్లు

ఖైరతాబాద్ పోస్టాఫీస్‌లో సర్వర్ డౌన్

● ఐదు రోజులుగా నిలిచిన సేవలు

ఖైరతాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోస్టాఫీస్‌లో ఐదు రోజులుగా సర్వర్ డౌన్ బోర్డులు కనిపిస్తున్నాయి. వినియోగదారులకు అందాల్సిన సేవలన్నీ నిలిచిపోవడంతో వివిధ పనుల కోసం ఎంతో మంది వచ్చి కంప్యూటర్లు పనిచేయడంలేదని తెలుసుకొని తిరిగి వెళ్తున్నారు. కాగా, ఈనెల 5వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా ఈ-సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. దీని వినియోగంలో సర్వర్ క్రాష్ అయినట్లు తెలుస్తోంది. దీంతో ఈనెల 4వ తేదీ నుండి ఇప్పటి వరకు లాగిన్‌లో ఇబ్బందులు రావడంతో పోస్టాఫీస్ సేవలు నిలిచిపోయాయి. సోమవారం నుంచి పోస్టాఫీస్ సేవలు యధావిధిగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.


ఎమ్మెల్యే కృష్ణారావుతో సమావేశమైన బీఆర్‌ఎస్ ఎర్రగడ్డ డివిజన్ నాయకులు

జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలి

ఎర్రగడ్డ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన బీఆర్‌ఎస్ ఎర్రగడ్డ డివిజన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని ఇప్పటి నుంచే ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్ కురేషి, నాయకులు జావెద్, మహ్మద్ అజీముద్దీన్, సయ్యద్ రసూల్, బాలు, నర్సింగ్‌రావు, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, బద్రుద్దీన్, భుజంగరావు, శ్రీకాంత్, తరుణ్, రవి, కళ్యాణి, లక్ష్మాజీ, వెంకటరమణ పాల్గొన్నారు.


కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు చెబుతున్న యువతి కుటుంబ సభ్యులు

వర్షంలో చిక్కుకుపోయిన యువతి

● క్షేమంగా ఇంటికి చేర్చిన కానిస్టేబుల్

బంజారాహిల్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వర్షంలో చిక్కుకుపోయి ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్న ఓ యువతికి కానిస్టేబుల్ అండగా నిలిచాడు. ఆమెను క్షేమంగా ఇంటికి చేర్చాడు. మెహిదీపట్నంకు చెందిన నైనిక గురువారం రామంతపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకుంది. సోదరుడు ఆమెను బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2లోని ముఫకంజా కాలేజీ బస్టాపులో వదిలేసి ఆర్టీసీ బస్సులో వెళ్లమని చెప్పాడు. కొద్దిసేపటికి భారీ వర్షం మొదలైంది. అరగంట అయినా వర్షం తగ్గలేదు. నైనిక ఒంటరిగా బస్టాపులో భయం భయంగా గడిపింది. అదే దారిలో వెళ్తున్న కార్ హెడ్‌క్వార్టర్స్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీధర్‌వర్మ ఆమెను గమనించాడు. నైనిక వద్దకు వెళ్లి విషయం అడిగి తెలుసుకున్నాడు. వరదను కూడా లెక్కచేయకుండా వర్షం తగ్గాక ఆమెను క్షేమంగా మెహిదీపట్నంలోని ఇంటికి చేర్చాడు. నైనిక కుటుంబసభ్యులు కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు చెప్పారు.



రెసో స్మార్ట్ యాప్ ఆవిష్కరణలో ప్రముఖులు

రెసోనెన్స్ విద్యాసంస్థల్లో డిజిటల్ తరగతులు

● శాంసంగ్ ఎడ్‌టెక్ కంపెనీ టాగ్ హైవ్‌తో ఒప్పందం



యాప్‌ను ఆవిష్కరిస్తున్న రెసోనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ పూర్ణచంద్రరావు, టాగ్ హైవ్ సీఈఓ పంకజ్ అగర్వాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శాంసంగ్ సహకారం ఉన్న ట్యాగ్ హైవ్ ఎడ్‌టెక్ కంపెనీతో కలిసి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధనను అందించేందుకు రెసో స్మార్ట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని రెసోనెన్స్ విద్యాసంస్థ డైరెక్టర్ ఎన్.పూర్ణచంద్రరావు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెసోనెన్స్, టాగ్ హైవ్‌లు కలిసి రూపొందించిన రెసో స్మార్ట్ యాప్‌ను, టాగ్ హైవ్ సీఈఓ పంకజ్ అగర్వాల్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఇంటర్ విద్యా విధానంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రతీ తరగతి గదిలో స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ద్వారా విద్యా బోధన ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పరిజ్ఞానాన్ని రెసో స్మార్ట్ యాప్‌లో వినియోగించి విద్యా బోధన చేస్తామన్నారు. ఇది విద్యార్థుల అధ్యయన విధానంలో ఒక సంపూర్ణ మార్పునకు నాంది పలుకుతుందన్నారు. విద్యార్థులు సుదీర్ఘ కాలం గుర్తుంచుకునేలా ప్రత్యేక అల్గోరిథంలతో రూపొందించిన స్మార్ట్ టూల్స్ ఇందులో ఉంటాయని, ఏఐ ఆధారిత ప్రశ్నాపత్రాలు, రియల్ టైం ప్రదర్శన, అడాప్టివ్ క్విజ్ వంటివి డిజిటల్ తరగతుల్లో ఉంటాయని తెలిపారు.

రూ.4 కోట్లతో నిమ్స్‌లో సుందరీకరణ పనులు

నిమ్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో సుందరీకరణ పనులకు నిమ్స్ యాజమాన్యం సిద్ధమైంది. ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించనున్న పనులకు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దోనెపూడి చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్‌తో కలిసి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూ.4 కోట్లను కేటాయించింది. రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్, ఆర్‌ఎంఓలు డాక్టర్ జీషనుద్దీన్, డాక్టర్ సాయినిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

● 3 కిలోల గంజాయి, రూ.1.50 లక్షలు స్వాధీనం


నిందితుడు ధన్‌రాజ్‌సింగ్, స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 3 కిలోల గంజాయి, రూ.150 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేట పరిసరాల్లో గంజాయి విక్రయాలపై నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు, గంజాయి విక్రేతలను వరుస అరెస్ట్‌లు చేశారు. దాంతో కొంతమంది గంజాయి విక్రేతలు ఇతర ప్రాంతాలకు మకాం మార్చారు. కార్వాన్ రహీంపురా ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో నిఘా పెట్టిన ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం తనిఖీలు చేపట్టారు. ధూల్‌పేటకు చెందిన ధన్‌రాజ్ సింగ్ అలియాస్ ధన్‌రాజ్ గంజాయి విక్రయాలు చేస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి 1.90 కిలోల గంజాయి, స్కూటీతోపాటు గంజాయి విక్రయాల నుంచి అర్జించిన రూ.1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ధన్‌రాజ్‌కు గంజాయి సరఫరా చేస్తున్న బన్సీకావల్ సింగ్, కోమల్, ఉత్తరేష్ జలపతిపై కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

మరో కేసులో 1.10 కిలోల గంజాయి స్వాధీనం

సైఫాబాద్ బాలజీనగర్‌లో గంజాయి విక్రయిస్తున్న షేక్ ఖాజాపాషాను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది అతడి వద్ద నుంచి 1.10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతడికి గంజాయి విక్రయాల్లో సహకరిస్తున్న నజీమ్ రహమాన్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడితోపాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.


కృష్ణానగర్‌లో పర్యటిస్తున్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి


స్థానిక మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

● మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్

యూసుఫ్‌గూడ, జులై 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్ వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం కృష్ణానగర్ వరద నీటి ముంపు ప్రాంతాల్లో మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్య పరిష్కారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ కృష్ణానగర్ వరద నీటి కాల్వ పనులకు ఇప్పటికే రూ.65 లక్షలు మంజూరు చేశామన్నారు. పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వరద నీటి కాలువ విస్తరణ కోసం కావాల్సిన నిధుల ప్రణాళికను సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. త్వరలోనే కృష్ణానగర్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. 10 గంటల్లో కురిసే వాన గంటలో కురవడం వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి కావాల్సిన రక్షణ చర్యలను తీసుకునేలా ప్రభుత్వం ఆదేశించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, హైడ్రా, డీఆర్‌ఎఫ్ అధికారులతో పాటు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్ యాదవ్, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ కొట్టడంతో

పడిపోయిన ద్విచక్ర వాహనదారుడు

● తల మీద నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి

బంజారాహిల్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఓ మహిళ నడుపుతున్న ద్విచక్ర వాహనం వచ్చి అతడి వాహనాన్ని ఢీ కొట్టింది. అదుపు తప్పిన యువకుడు మరో వైపు పడిపోయాడు. అదే సమయంలో అదే దారిలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రం తల మీద నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాజేంద్రనగర్ సులేమాన్ నగర్‌కు చెందిన మహ్మద్ ఆదిల్(31) కార్ డెకార్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పని మీద ద్విచక్ర వాహనంపై ఎన్‌ఎఫ్‌సీఎల్‌కు బయలుదేరాడు. విరించి ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి అతడి పక్క నుంచి వెళ్తున్న ఓ మహిళ నడుపుతున్న వాహనం అదుపు తప్పి ఆదిల్ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీ కొట్టింది. కంట్రోల్ కోల్పోయిన ఆదిల్ మరో వైపునకు పడిపోయాడు. అదే దారిలో వెళ్తున్న మెహిదీపట్నంకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కింద పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


బస్సు కింద పడిన ద్విచక్ర వాహనం


వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు


ఫిలింనగర్ దైవసన్నిధానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు


శ్రీ విజయలక్ష్మి ఆలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

బంజారాహిల్స్/ఎర్రగడ్డ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం, ఫిలింనగర్ దైవసన్నిధానం ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎన్‌బీటీనగర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు వ్రతాన్ని ఆచరించారు. ఎర్రగడ్డలోని శ్రీ విజయలక్ష్మి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భగుడిలోని శ్రీ విజయలక్ష్మి అమ్మవారిని 108 లీటర్ల పాలతో అభిషేకం చేసి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎం.వి.రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లో వ్రతం నిర్వహిస్తున్న గృహిణులు

బల్కంపేట ఎల్లమ్మకు పసుపు, కుంకుమతో అలంకారం


పసుపు, కుంకుమతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

అమీర్‌పేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం కావడంతో బల్కంపేట ఎల్లమ్మను పసుపు, కుంకుమతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారమే మహాలక్ష్మి వ్రతం కూడా ఉండడంతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చేసిన అలంకారాలతో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది.

పోచమ్మ ఆలయంలో గడప పూజ

పంజాగుట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ డివిజన్ ఎర్రమంజిల్ ఐపీ క్వార్టర్స్‌ను కూల్చివేసి ఆ స్థలాన్ని నిమ్స్ అభివృద్ధి కోసం కేటాయించారు. కొత్తగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన గడప పూజలో స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయ నిర్మాణ పనులను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు.

బండ నరసింహుడి వార్షికోత్సవం

ఖైరతాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభువుగా 279 సంవత్సరాల క్రితం ఖైరతాబాద్‌లో వెలసిన బండ నరసింహస్వామి వార్షికోత్సవం నేడు జరగనుంది. కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ఖ్యాతిగాంచిన స్వామి వారిని దర్శించుకునేందుకు జంటనగరాలే గాక తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానుండడంతో ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చాత్తాద శ్రీ వైష్ణవులైన తింత్రిణీపురం వంశీజుల ఇంట్లో బండపై వెలసి కలలో తాను వెలిశానని తెలపగా అప్పటి నుంచి వారు పూజలు చేస్తుండడంతో పాటు రాను రాను చుట్టు ప్రక్కల వారు గ్రామస్తులు పూజలు చేస్తుండగా కోరికలు తీరుస్తుండడంతో స్వామివారికి పెద్ద ఎత్తున భక్తులు పెరిగారు. స్వామివారి 279వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. వేడుకలకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు హాజరవుతారని ఆలయ నిర్వాహకులు తింత్రిణీపురం శ్రీహరి స్వామి, వెంకటేష్ స్వామి, ఆలయ కార్యవర్గ సభ్యులు తెలిపారు.


ఫ్రెంచ్ ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న అలియన్స్ ఫ్రాంచైజ్ డైరెక్టర్ మౌద్ మిభావ్, బ్యూరో ఆఫ్ ఫ్రాన్స్ రోహిణి రెడ్డిపల్లి తదితరులు

ఫ్రెంచ్ రుచులను వడ్డించిన విద్యార్థులు

బంజారాహిల్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నోరూరించే ఫ్రెంచ్ రుచులకు రీజెన్స్ కాలేజ్ వేదికైంది. ఎర్రమంజిల్‌లోని రీజెన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో శుక్రవారం ఫ్రెంచ్ డేను పురస్కరించుకొని విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రెంచ్ ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని అలియన్స్ ఫ్రాంచైజ్ డైరెక్టర్ మౌద్ మిబావ్, బ్యూరో ఆఫ్ ఫ్రాన్స్ రోహిణి రెడ్డిపల్లి ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాచీన ఫ్రెంచ్ వంటకాలతోపాటు ఫ్రెంచ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పలు చిత్రాలను ప్రదర్శించారు. మౌద్ మిబావో ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు వెన్నతో రూపొందించిన ఈఫిల్ టవర్‌ను చూసి మురిసిపోయారు. కార్యక్రమంలో తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెఫ్ నవీన్ నాగరాజు, యంగ్ చెఫ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి చెఫ్ దేవ్రాజ్ భౌమిక్, చెఫ్ రిజ్వాన్ ఐదీర్, రీజెన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.రమేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడిన ఎంఆర్‌డబ్ల్యూఏ అభివృద్ధి

ఎర్రగడ్డ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మోతినగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎంఆర్‌డబ్ల్యూఏ)కు కొన్ని సంవత్సరాల నుంచి ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని అసోసియేషన్ సభ్యులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం మోతినగర్ కమ్యూనిటీ హాల్లో సభ్యులు సమావేశమయ్యారు. ఎన్నికలపై చర్చించారు. అసోసియేషన్ సభ్యులు నాగేశ్వరరావు, డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి, ఎస్.అంజిరెడ్డి, తులసీదాస్, ఐవీ రాజు, గోపాల్‌రావు, ఎస్.వెంకటస్వామి, కుటుంబరావు, రవీంద్రనాథ్, శ్రీలత, సుబ్బారావు, బ్రహ్మానందరెడ్డి, యాదగిరి, వెంకటేష్‌గౌడ్, సతీష్ గౌడ్, కొల్లప్ప పాల్గొన్నారు.

వ్యాపారంలో నష్టాన్ని తట్టుకోలేక..

● రైలు కింద పడి వ్యాపారి ఆత్మహత్య



బ్రహ్మయ్య మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయి జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యాపారి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అల్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది.. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం ప్రాంతానికి చెందిన బ్రహ్మయ్య (69) వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయి జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం అల్వాల్ బ్యారెక్ వద్ద రైలు కింద పడి ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి



గుర్తుతెలియని ప్రయాణికుడి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణం చేస్తున్న ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మృతిచెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ వీక్లి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు శుక్రవారం ఉదయం చేరుకుంది. అందులోని ప్రయాణికుడు అప్పటికే మరణించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మరణించాడన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అన్నదానం చేస్తున్న పాండు యాదవ్

వడిబియ్యంతో అన్నదానం

బోయినపల్లి, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి నందమూరినగర్‌లోని పోచమ్మ ఆలయంలో వడిబియ్యంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భీమేష్, నరేష్, విఠల్, బాల్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, పద్మ, భాగ్యమ్మ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



రాఖీలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సి.వైష్ణవి యాదవ్

ఇంటింటికీ రాఖీల పంపిణీ

మారేడుపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ ఈస్ట్ మారేడుపల్లి లోహియా నగర్, వడ్డెర బస్తీలలో కాంగ్రెస్ యువ నాయకురాలు సి.వైష్ణవి యాదవ్ శుక్రవారం రాఖీలను ఉచితంగా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. బస్తీలలో పంపిణీ చేయడం సంతోషాన్ని కలిగిస్తుందని ఆమె అన్నారు. అంతకు ముందు వడ్డెర బస్తీలో జరిగిన వరలక్ష్మీ పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, ఎస్. వెంకటేష్, బొట్టు రాజా, రవి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాష్టమి వేడుకలపై నిర్వహిస్తున్న సమావేశం

కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించాలి

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పాన్ బజార్‌లోగల శ్రీవేణు గోపాల స్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి రవికాంత్ కర్నే అన్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఈఓ అధ్యక్షతన ప్రస్తుత ధర్మకర్తల మండలి, మాజీ ధర్మకర్తలు, భక్తులు, బస్తీవాసులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ బొల్లు శ్రీనివాస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మాకు ఎల్లేష్, ధర్మకర్తలు బాబుగౌడ్, సదానంద్, లక్ష్మీ. ఎం అశోక్ మాజీ ధర్మకర్తలు ముత్యాల సాయిబాబా, పండుగ శ్రీనివాస్, ఉప్పు రామ్మోహన్, పంచముఖి హనుమాన్ దేవాలయ ధర్మకర్త రాజ్ కుమార్, బస్తీవాసులు మనోజ్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల హామీ ఏమైంది?

● ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

అడ్డగుట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీప్రకారం పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఈవిషయమై ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు రూ. 6 వేలు, అలాగే వృద్ధులు, వితంతువులు ఒంటరి మహిళలకు సైతం పింఛన్ పెంచాలన్నారు. ఈనెల 25న సీతాఫల్‌మండిలో మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మందకృష్ణ పాల్గొంటారన్నారు. సభకు పెద్దఎత్తున దివ్యాంగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ సికింద్రాబాద్ కోఇన్‌చార్జి చెండేటి వేణుగోపాల్, జోగు దశరథ్, కే రాజు, ఎంఎంఎస్ నాయకురాలు భూపతి సుజాత, ఎంఎస్‌పీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు బాబురావు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో మహాకాళీ, మాణిక్యాల అమ్మవార్లను గాజులతో శుక్రవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మూడో శుక్రవారం, వరలక్ష్మీ పూజను పురస్కరించుకుని విశేష అలంకరణ గావించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

(సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)

ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో సదుపాయాలేవి?

● ఇబ్బందుల్లో క్రీడాకారులు

● వర్షాకాలం వస్తే చెరువే..



వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తున్న గ్రౌండ్

తిరుమలగిరి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మౌలిక సదుపాయాలు లేవు. తాగునీటి, వాష్‌రూమ్ సౌకర్యాలు కల్పించలేదు. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం కూడా ఒక కారణమని పలువురు క్రీడాకారులు విమర్శిస్తున్నారు. ఇక వర్షాకాల సీజన్‌లో గ్రౌండ్ వర్షపు నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ఎండాకాలంలో దుమ్ముధూళితో కొట్టుమిట్టాడుతోంది. కాగా ఆటస్థలం ఎగుడు దిగుడుగా ఉండటం వల్ల ఆటగాళ్లు సరిగా ప్రాక్టీస్ చేయలేని పరిస్థితి. గేదెలు సైతం గ్రౌండ్‌లో చొరబడి పచ్చగడ్డి కోసం సంచరిస్తుండటం వల్ల పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ప్రైమరీ స్కూల్ నుంచి డిగ్రీ కళాశాల విద్యార్థుల వరకు ఇందులోనే ప్రాక్టీస్ చేస్తుంటారు. దీంతో పాటు స్పోర్ట్స్ కోటా లో పబ్లిక్ సెక్టర్లో ఉద్యోగాలు చేసుకుంటూ పలువురు స్థిరపడ్డారు.

● జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..

తిరుమలగిరి, బొల్లారం ప్రాంతాల్లో బ్రిటీష్ మిలిటరీ అధికారులు అప్పట్లో అధికంగా ఉండేవారు. వారంతా సాయంత్రం పూట ఆటవిడుపులో భాగంగా ఇదే గ్రౌండ్ లో ఫుట్‌బాల్ ఆడేవారు. వారి ఆటను ఆస్వాదిస్తూనే స్థానిక పౌరులు కూడా మక్కువను పెంచుకున్నారు. వాళ్లూ సాధన చేసేవారు. ఇక్కడ సాధన చేసిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రాతినిధ్యం కూడా వహించారు. అయితే.. గ్రౌండ్ పూర్తిగా మిలిటరీ ఆధీనంలో ఉంది. 1979లో డిఫెన్స్ మినిస్టర్ సుబ్రమణ్యం, 1981లో దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీలు సివిలియన్స్ కూడా ఈ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసుకోవచ్చు అంటూ మిలిటరీ అధికారులకు సూచించారు.



ఫుట్‌బాల్ గ్రౌండ్

పైప్‌లైన్ వేయాలి

వర్షాకాలంలో గ్రౌండ్ పూర్తిగా వర్షపు నీటితో నిండి బురదమయంగా మారుతోంది. ఆపై గడ్డి ఏపుగా పెరుగుతోంది. మిలిటరీ క్వార్టర్స్ వద్ద గోడ అడ్డంగా కట్టడంతో వర్షపు నీటి గ్రౌండ్ నిండుతోంది. సగం గ్రౌండ్‌లో ఆడుకోవాల్సి వస్తోంది. రక్షణ శాఖ అధికారులు స్పందించి 100 మీటర్స్ వరకు పైప్‌లైన్ వేస్తే నీరు సాఫీగా వెళ్లిపోతాయి.

మోహన్, జాతీయ క్రీడాకారుడు

అధికారులతో మాట్లాడుతాను



తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ రక్షణ శాఖ ఆధీనం ఉంది. ఆ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తా. గ్రౌండ్ అభివృద్ధి, తాగు నీరు, వాష్‌రూంలు ఏర్పాటు చేయిస్తా. అన్నీ హంగులతో తీర్చిదిద్దడానికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళతాం.

- భానుక నర్మద,
కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు

నేడు మదర్‌థెరీసా విగ్రహం వద్ద నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : దళిత, క్రైస్తవులు, ముస్లింలను ఎస్సీలుగా గుర్తించాలని కోరుతూ సికింద్రా బాద్ మదర్ థెరీసా విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ దళిత్ క్రిస్టియన్స్ (ఎన్‌సీడీసీ), కాథలిక్ బిషప్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా (సీబీసీఐ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఇన్ ఇండియా (ఎన్‌సీసీఐ), ఎస్సీ బీసీ కమిషన్ ఆర్చ్ డయాసిస్ ఆఫ్ హైదరాబాద్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ (టీసీసీ), నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్ (ఎన్‌డీసీడబ్ల్యూ) సంఘాల ప్రతినిధులు శుక్రవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు పలు అంశాలను వివరించారు. నిరసన కార్యక్రమాన్న చేపట్టామని, దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ దళిత్ క్రిస్టియన్స్ (ఎన్‌సీడీసీ) జాతీయ కార్యదర్శి విజయ్ కుమార్ మోతుకూరి, టీసీబీసీ డిప్యూటీ సెక్రటరీ ఫాదర్ రాజ్ అలెక్స్, ఎస్సీ, బీసీ కమిషన్ ఆర్చ్ డయాసిస్ ఆఫ్ హైదరాబాద్ నుంచి ప్రభుదాస్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ తరఫున రాబర్ట్ సూర్య ప్రకాష్, స్లీవా గెలేలీలు పాల్గొన్నారు.



షాబాద్‌గూడలో స్థానికులతో కార్పొరేటర్ సామల హేమ

షాబాద్‌గూడలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ షాబాద్‌గూడలో శుక్రవారం అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. స్థానికంగా నిర్వహిస్తున్న సీసీ రోడ్డుపనులను పరిశీలించారు. ఈ పనులను పద్దెనిమిది లక్షల రూపాయలతో చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు. అనంతరం స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ , నాయకులు శైలేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పేరిట మోసం

● పోలీసుల అదుపులో నిందితుడు

బోరబండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని నమ్మించి పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితుడిని బోరబండ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. బోరబండ బలహీనవర్గాల కాలనీ అంబేడ్కర్ నగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు రెండు పడక గదుల ఇల్లు ఇప్పిస్తానంటూ పలువురి వద్ద నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. అంతేగాకుండా ఇళ్లు మంజూరైనట్లు నకిలీ పత్రాలను వారికి అందజేశాడు. ఆ పత్రాలతో కమలానగర్, కొల్లూరు ప్రాంతాలకు వెళ్లిన వారికి తాము మోసపోయినట్లు తెలిసింది. దీంతో ముగ్గురు బాధితులు బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.3.5లక్షలు వసూలు చేశాడని, తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితుల సంఖ్య ఇంకా పెరగవచ్చునని బోరబండ ఇన్‌స్పెక్టర్ ఎం.సురేందర్‌గౌడ్ తెలిపారు. ఎస్ఐ కాశయ్య ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

యూసుఫ్‌గూడ, జులై 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్ వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం కృష్ణానగర్ వరద నీటి ముంపు ప్రాంతాల్లో మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్య పరిష్కారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ కృష్ణానగర్ వరద నీటి కాల్వ పనులకు ఇప్పటికే రూ.65 లక్షలు మంజూరు చేశామన్నారు. పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వరద నీటి కాలువ విస్తరణ కోసం కావాల్సిన నిధుల ప్రణాళికను సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. త్వరలోనే కృష్ణానగర్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. 10 గంటల్లో కురిసే వాన గంటలో కురవడం వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి కావాల్సిన రక్షణ చర్యలను తీసుకునేలా ప్రభుత్వం ఆదేశించిందని గుర్తు చేశారు.

లక్ష్మీదేవికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బౌద్ధనగర్ కనకదుర్గ అమ్మవారు

బౌద్ధనగర్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌ల పరిధిలోని మహిళలు.. లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. ఒకరికొకరు వాయినాలు అందిపుచ్చుకున్నారు. కాగా, బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయచైర్మన్ కె.ధరణీధర్, ప్రధానార్చకులు శ్రీనివాసులు కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయం, సీతాఫల్‌మండి రామాలింగేశ్వర స్వామి, కళ్యాణ వేంకటేశ్వరస్వామి, బౌద్ధనగర్ రామాలయాల్లు కూడా కిటకిటలాడాయి.



సాకతో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ తదితరులు

మహాకాళి అమ్మవారికి సాక సమర్పణ

సికింద్రాబాద్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతర రంగం కార్యక్రమంలో భవిష్యవాణి చెప్పిన ప్రకారం ఈ శుక్రవారం కూడా మహాకాళి అమ్మవారికి పప్పు, బెల్లం, సాక సమర్పించారు. రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, భక్తులు అమ్మవారికి సాక సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రావణశుక్రవారం, వరలక్ష్మీ వ్రతం కావడంతో ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది.



బొల్లారం సదర్‌బజార్‌లో ఉన్న మహంకాళి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆపై ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

(తిరుమలగిరి,ఆంధ్రజ్యోతి)



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో కలిసి ఆయన.. 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో నిరంతరం పర్యవేక్షించి చెక్కుల పంపిణీ ఆలస్యం కాకుండా చూస్తున్నారని, అధికారులు కూడా నిబద్ధతతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు.



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

నిరుపేదల వైద్యానికి సహకారం అందిస్తాం

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): నిరుపేదల వైద్యసేవలకు తమవంతు సహకారం అందిస్తామని సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో మాణికేశ్వరినగర్, ఏసీఎస్ నగర్‌కు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన లక్ష రూపాయల విలువ చేసే ఎల్‌ఓసీ పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త రాజు సుందర్, పరికబండ మాజీ సర్పంచ్ అర్జున్, మనోహరాబాద్ ఎంపీటీసీ వెంకటేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.